క్లుప్తంగా

అప్రమత్తంగా ఉండండి



అతిసారం బాధితులను పరామర్శిస్తున్న స్పెషల్ నోడల్ అధికారి

రుద్రవరం: అతిసారం ప్రబలుతున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఫ్యామిలీ డాక్టర్ స్పెషల్ నోడల్ అధికారి జగదీష్ చంద్రారెడ్డి రుద్రవరం పీహెచ్‌సీ వైద్య సిబ్బందికి సూచించారు. ×అదుపులోకి రాని అతిసారం÷ పేరుతో మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితం కావడంతో అధికారులు గ్రామంలో పర్యటించారు. పీహెచ్‌సీలో బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కూడా గ్రామంలో తాగు నీటి సరఫరాను పరిశీలించి వివిధ కాలనీల్లో కుళాయిల నుంచి వచ్చే నీటి నమూనాలు సేకరించారు.ల్యాబ్‌కు తీసుకెళ్లి నీటిని పరీక్షిస్తామని వారు తెలిపారు. అలాగే ఎస్సీ కాలనీలో పంచాయతీ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు.

జాబ్‌మేళాలో 67మంది ఎంపిక

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్ మేళా నిర్వహించారు.ఈ ఈ మేళాకు జిల్లాలోని వివిధ కళాశాలల నుంచి 157మంది విద్యార్థులు హాజరు కాగా 67 మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శైలజారాణి, జేకేసీ కో ఆర్డినేటర్ పార్వతి, తదితరులు పాల్గొన్నారు.

11న విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

నంద్యాల(న్యూటౌన్): ఈనెల 11వ తేదీన ప్రపంచ సైన్స్, విద్యా, బాలల దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు రెడ్‌క్రాస్ చైర్మన్ దస్తగిరి, కోశాధికారి నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం డీఈఓ జనార్దన్ రెడ్డి ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాజంలో అవయవదానం గురించి అవగాహన, విద్యార్థుల పాత్ర, పర్యావరణ పరిరక్షణలో కృత్రిమ మేధా పాత్ర అనే అంశంపై పోటీలు జరుగుతాయని తెలిపారు. మరింత సమాచారం కోసం సెల్ : 94900 04866 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

ఉయ్యాలవాడ : ఈ నెల 9,10, 23, 24 తేదీల్లో మండలంలో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనవరి 1, 2025 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు కొత్తగా ఓటరుగా పేరు నమోదు చేసుకోవచ్చన్నారు.

సమస్యల పరిష్కారానికే సభలు

ఉయ్యాలవాడ: రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం మండలంలోని సుద్దమల్ల గ్రామంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామంలో గతంలో చేపట్టిన భూ రీ సర్వే ద్వారా 183.90 ఎకరాలు ప్రభుత్వ భూమి, 30.30 ఎకరాల దేవాలయాల భూముల విస్తీర్ణాన్ని గుర్తించడం జరిగిందన్నారు. రైతులకు సంబంధించి 328 మంది ఖాతాదారులుగాను 1009.49 ఎకరాల్లో భూ సర్వే నిర్వహించడం జరిగిందన్నారు. అయితే ఎల్ఎమ్‌పీలు, విస్తీర్ణంలో తేడాలు ఉన్నట్లు 68 మంది రైతులు దరఖాస్తులు అందజేశారన్నారు.

పుసులూరు గ్రామ సభకు 124 దరఖాస్తులు

నంద్యాల(అర్బన్): మండల పరిధిలోని పుసులూరు గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ గ్రామ సభకు 124 దరఖాస్తులు వచ్చినట్లు డిప్యూటీ తహసీల్దార్లు రామచంద్రారావు, నాగరాజు తెలిపారు. సర్పంచ్ నారాయణ అధ్యక్షతన జరిగిన గ్రామ సభలో జాయింట్ ఎల్‌పీఎంలకు సంబంధించి 62, కొలతల తేడాలకు సంబంధించి 58 దరఖాస్తులు వచ్చాయన్నారు.

అర్జీలను అప్‌లోడ్ చేయండి

శిరివెళ్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన అర్జీలను అప్‌లోడ్ చేయాలని ఆర్‌డీఓ విశ్వనాథ్ అన్నారు. మంగళవారం ఆయన తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 85 మంది ఇళ్ల స్థలా లు, భూ సమస్యలపై అర్జీలు పెట్టుకున్నారన్నారు. వాటిని ఆలస్యం కాకుండా వెంటనే అప్‌లోడ్ చేయాలని, లేకపోతే సంబంధిత వీఆర్వోలపై చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుష్పకుమారి, డిప్యూటీ తహసీల్దార్ కిషోర్‌కుమార్, ఆర్ఐ సుచరిత, వీఆర్వోలు పాల్గొన్నారు.

వినాయక ఘాట్‌ను శుభ్ర పరచాలి

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని చిన్నచెరువు కట్ట వద్ద ఉన్న వినాయక ఘాట్‌ను శుభ్ర పరచాలని శివ, అయ్యప్పస్వామి దీక్షా పరులు మంగళవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో నిష్టతో స్వాములు తెల్లవారుజామున చెరువు కట్ట పరిసర ప్రాంతాల్లో స్నానాలకు వెళ్తారని, అయితే, అక్కడ పిచ్చిమొక్కలు, చెత్తా చెదారం పేరుకుపోయిందన్నారు.


అవస్థలు 'అపార్'ం!



● ఈ విద్యార్థి పేరు భరత్‌కుమార్. దొర్నిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్నాడు. స్కూల్ రికార్డుల్లో పుట్టిన తేది 2009 డిసెంబర్ 27గా ఉంది. ఆధార్ కార్డులో మాత్రం 2009 జనవరి 1 అని ఉంది. ఆధార్‌కార్డులో పుట్టిన తేది మార్చుకోవాలంటే తప్పని సరిగా డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్ కావాలి. దీని కోసం తల్లిదండ్రులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టు ప్రదక్షిణలు చేస్తున్నారు.

● ఇది ఈ ఒక్క విద్యార్థి సమస్య కాదు. చాలా మందిది ఇదే పరిస్థితి. ఆధార్‌కు విద్యార్థికి సంబంధించి స్కూల్‌లో ఉన్న వివరాలు తేడాలు ఉన్నాయి. దీంతో అపార్ నమోదు నత్తనడకన సాగుతోంది.

- ఆధార్ కార్డులో ఒకలా..స్కూల్ రికార్డుల్లో మరోలా విద్యార్థుల వివరాలు
- ఫలితంగా నత్తనడకన అపార్ నమోదు ప్రక్రియ
- పుట్టినతేది ధ్రువీకరణ పత్రం కోసం తల్లి దండ్రుల పాట్లు
- నియోజకవర్గంలో 41,634 మంది విద్యార్థులు
- ఇప్పటి వరకు అపార్‌కు జనరేట్ అయిన వారి సంఖ్య 24,815 మంది మాత్రమే



దొర్నిపాడు జెడ్పీహెచ్ఎస్‌లో అపార్ నమోదు చేయించుకుంటున్న విద్యార్థులు

నియోజకవర్గంలో నవంబర్ 5వ తేది వరకు అపార్ నమోదు వివరాలు

మండలం	విద్యార్థుల సంఖ్య	అపార్ నమోదు	శాతం
ఆళ్లగడ్డ	15,408	8,292	53.82
చాగలమర్రి	8,285	5,596	67.54
దొర్నిపాడు	2,662	1,637	63.90
రుద్రవరం	5,560	2,751	49.48
శిరివెళ్ల	7,658	5,055	66.01
ఉయ్యాలవాడ	2,211	1,484	67.12
మొత్తం	41,634	24,815	59.60

దొర్నిపాడు: నూతన విద్యావిధానంలో భాగంగా ఒకదేశం..ఒకస్టూడెంట్ కార్డు పేరుతో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన ఆటోమెటేడ్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)నమోదులో పలు సమస్యలు తలెత్తుతున్నాయి.ఆధార్‌కార్డు తరహాలో ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదివే విద్యార్థులకు 12 అంకెల జీవితకాలపు ఐడీ కోసం విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు.

అధార్‌లో ఒక పేరుంటే స్కూల్లో పేరు వేరేలాగా ఉంది. ఇది పక్కన పెడితే పుట్టిన తేదీల్లో మార్పులు ఉన్నాయి. అపార్ కార్డు ఎన్‌రోల్‌మెంట్ చేయడానికి ఆధార్ వివరాలనే ప్రమాణికంగా సాఫ్ట్‌వేర్‌ను సిద్ధం చేశారు. ఆధార్‌లో విద్యార్థుల వివరాలు తప్పుల తడకలుగా ఉండటంతో వాటిని ఆన్‌లైన్‌లో పొందుపరచడానికి సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో విద్యార్థులకు అపార్ నమోదు ఇబ్బందిగా మారింది.

నెలాఖరు నాటికి పూర్తయ్యేనా?

ఒక సారి అపార్‌కార్డు ఇస్తే చదువు పూర్తయి, ఉద్యోగం సాధించేవరకు ఇదే నంబరు గల కార్డు ఉంటుంది. అయితే, ప్రస్తుతం ఎదురవుతున్న సమస్యలు అధిగమించి అపార్ జనరేట్ చేయాలంటే చాలా సమయం తీసుకునేలా ఉంది. పుట్టిన తేది ధ్రువపత్రం లేని వారికి ఆధార్‌లో మార్పులు చేయడం కుదరదని చెబుతున్నారు. కానీ అపార్ నమోదుకు అధికారులు మాత్రం ఈనెలాఖరు వరకే గడువు ఇచ్చారు. నియోజకవర్గంలో ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులు 41,634 మంది ఉన్నారు. ఇందులో ఇప్పటి వరకు అపార్‌కు జనరేట్ అయిన వారి సంఖ్య 24,815 మాత్రమే.

పుట్టిన తేదీల్లో వ్యత్యాసాలు

ముఖ్యంగా అపార్ నమోదుకు వచ్చిన చిక్కు పుట్టినతేది. కొంత మంది ఉపాధ్యాయులు 10 వ తరగతి పూర్తయ్యే నాటికి 15 ఏళ్లు ఉండేలా పుట్టిన తేదీల్లో తల్లిదండ్రుల అనుమతితో అప్పట్లో మార్పులు చేసి రికార్డుల్లో ఎక్కించారు. దీంతో ఆధార్ కార్డులో, స్కూల్ రికార్డు, పుట్టిన తేది ధ్రువ పత్రంలో వివరాలు వేర్వేరుగా ఉన్నాయి. ఉపాధ్యాయులు స్కూల్ రికార్డు ప్రకారమే ఆధార్‌లో పుట్టిన తేదీలను మార్చుకోవాలని, స్కూల్ రికార్డుల్లో మార్పులు చేయడం కుదరని తల్లిదండ్రులకు చెబుతున్నారు. దీంతో పుట్టిన తేది ధ్రువపత్రం ఉన్నవారు ఆధార్‌కార్డుల్లో మార్పులు చేయించుకుంటున్నారు. ఈ సర్టిఫికెట్ లేని వారు పిల్లలు పుట్టిన వైద్యశాలలు, గ్రామ పంచాయతీల చుట్టూ తిరుగుతున్నారు. చాలా మందికి గ్రామీణ ప్రాంతాల్లో పుట్టిన తేది వివరాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. లేట్ బర్త్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే సుమారు 2 నెలల సమయం పట్టేలా ఉంది. గ్రామ పంచాయతీ తీర్మానం, పుట్టిన తేది వివరాలు ఏ రికార్డులో లేవని తహసీల్దార్ ఇచ్చిన ఫాం-10, ఇవన్నీ జతచేసి ఆర్‌డీఓకు పంపాలి. అక్కడ పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే ఆర్‌డీఓ గ్రామ సచివాలయాల్లో పుట్టిన తేది నమోదుకు ఉత్వర్వులు ఇస్తారు. ఇదంతా జరగాలంటే సుమారు 60 రోజులు పట్టేలా ఉంది. దీంతో పాఠశాల అడ్మిషన్ రిజిస్టర్ ప్రకారం ప్రధానోపాధ్యాయులు ఇచ్చే సర్టిఫికెట్‌తో ఆధార్‌లో మార్పులు చేసేలా ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. లేకపోతే ఈ ప్రక్రియ త్వరగా పూర్తి కాదు.

స్కూల్ రికార్డు ప్రకారం సవరణలు చేయాలి



విద్యార్థులు అపార్‌కార్డు కోసం ఇబ్బందులు పడుతున్నారు. స్కూల్ రికార్డు ప్రకారం అధార్‌లో పేర్లు, పుట్టిన తేదీని మార్పులు చేసేలా ఆధార్ నమోదు కేంద్రాలకు ఆదేశాలు ఇవ్వాలి. చాలా మందికి పుట్టిన తేది ధ్రువపత్రం లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది తల్లిదండ్రులు పుట్టినతేది వివరాలను నమోదు చేయించుకోలేదు. పట్టణ ప్రాంతాల్లో అయితే పురపాలక, ప్రభుత్వ వైద్యశాలల్లో పుట్టినతేది వివరాలు ఉంటాయి. అధికారులు చొరవ తీసుకోని విద్యార్థుల అపార్ అవస్థలను తొలగించాలి.

–పెద్దరాముడు, క్రిష్టిపాడు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం



అపార్ కార్డు నమోదుకు సంబంధించిన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సగానికి పైగా విద్యార్థి పేరు, తల్లిదండ్రులు, పుట్టిన తేదీల్లో మార్పులు ఉన్నాయి. స్కూల్ రికార్డు ప్రకారమే ఆధార్‌లో పుట్టిన తేది మార్చుకోవాలని తల్లిదండ్రులకు సూచిస్తున్నాం. ఇందుకు బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరిగా కావాలి. చాలా మందికి ఈ సర్టిఫికెట్ లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. త్వరలోనే వారు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

–మనోహర్‌రెడ్డి, ఎంఈఓ, దొర్నిపాడు

స్పోర్ట్స్

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థితో హెచ్ ఎం.కోటయ్య, ఉపాధ్యాయులు

చాగలమర్రి: మండల కేంద్రం చాగలమర్రిలోని బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న షాహీద్ అనే విద్యార్థి అండర్–14 స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.కోటయ్య, ఉపాధ్యాయులు మంగళవారం ప్రత్యేకంగా ఆ విద్యార్థిని అభినందించారు. గత నెల 18వ తేదీన ఉమ్మడి జిల్లా కేంద్రం కర్నూలు నగరంలోని ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరచి అండర్–14 వాలీబాల్ జిల్లా జట్టుకు సెలెక్ట్ అయ్యాడన్నారు. ఈ నెల 9 నుంచి 11వ తేది వరకు విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్వహించే రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ పోటీల్లో జిల్లా జట్టుకు విద్యార్థి షాహీద్ ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

బేస్‌బాల్, బాక్సింగ్ మీట్ కం ఎంపిక పోటీలు ప్రారంభం



బాక్సింగ్ పోటీలు ఆడుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని శ్రీరామకృష్ణ పీజీ కళాశాల క్రీడా మైదానంలో మంగళవారం ఉమ్మడి జిల్లాలకు చెందిన అండర్–17, 14 బాల బాలికల బేస్‌బాల్, బాక్సింగ్ ఎంపిక పోటీలను రామకృష్ణ విద్యాసంస్థల అధినేత రామకృష్ణారెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడల్లో నంద్యాల జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను సమానంగా భావించి ముందుకు వెళ్లాలన్నారు. ఉమ్మడి జిల్లాలోని 600 మంది క్రీడాకారులు ఎంపికలకు హాజరైనట్లు శ్రీనాథ్ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ హేమంత్‌రెడ్డి, ఏపీరెడ్డి, దండె నాగరాజు, ప్రభాకర్, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

క్రీడాపోటీల్లో విజేతలకు ప్రోత్సాహకం పెంపు

నంద్యాల(న్యూటౌన్): ఒలింపిక్స్ ఏసీఎన్ గ్రేమ్స్ విజేతలకు ఇచ్చే ప్రోత్సాహకం పెరిగినట్లు నంద్యాల జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఉత్తర్వుల మేరకు దేశంలో ఉత్తమ స్పోర్ట్స్ పాలసీగా ఏపీ నూతన క్రీడా పాలసీని తీసుకొచ్చిందన్నారు. ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటా 2 నుంచి 3శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధిస్తే రూ.75లక్షల నుంచి రూ.7కోట్ల వరకు పెంచినట్లు తెలిపారు. స్పోర్ట్స్ ఫర్ ఆల్ విధానంతో నూతన క్రీడా పాలసీకి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారన్నారు.దీంతో పతకాలు సాధించే క్రీడాకారులకు భారీ ప్రోత్సాహకాలు ఇవ్వనున్నట్లు తెలిపారు.

క్రైం కార్నర్

కారు బోల్తా.. ఐదుగురికి గాయాలు



చాగలమర్రి వద్ద జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు

చాగలమర్రి: మండల కేంద్రంలోని ఎస్‌కేఆర్ డాబా సమీపంలో 40వ నంబరు జాతీయ రాహదారిపై డివైడర్‌ను ఢీకొట్టి కారు బోల్తా పడిన ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న ఐదుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం హైదారాబాద్‌కు చెందిన నాగేష్ కుటుంబసభ్యులు టీఎస్ 15 ఈఎస్ 6589 నంబరుగల కారులో తిరుమలకు వెళ్లి స్వామి వారి దర్శనం చేసుకొని తిరిగివస్తున్నారు. చాగలమర్రిలోని ఎస్‌కేఆర్ డాబా సమీపంలో జాతీయ రహదారిపై కారు ముందరి టైరు పేలడంతో అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నాగేష్, చంద్రశేఖర్, సాయిరాం, అఖిల, నాగలక్ష్మీ స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న టోల్‌ప్లాజా అంబులెన్సుతో పాటు 108 సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారికి చికిత్స అందించారు. పోలీసులు ప్రమాద స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

- కలెక్టర్ కార్యాలయం ముట్టడించిన ఎస్ఎఫ్ఐ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వం నిర్లక్ష్యం వీడి విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళవారం విద్యార్థులతో కలిసి వారు జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజా, ఎంఆర్ నాయక్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యా, వసతి దీవెనలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 3,480 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే 77వ జీవోను వెంటనే రద్దు చేయాలని, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అనంతరం డీఆర్ఓ రామునాయక్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు హరివర్ధన్, కిశోర్, అశోక్, శివకుమార్, సంతోష్, మధు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నంద్యాల(న్యూటౌన్): ఏపీ ప్రభుత్వ స్కూల్ స్వీపర్స్ అండ్ ఆయాల యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివబాలకృష్ణ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు స్కూళ్లలో పని చేస్తున్న ఆయాలకు నాలుగు నెలల నుంచి జీతాలు ఇవ్వలేదన్నారు. దీంతో ఆయాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. 108 జీవో ప్రకారం రూ.11,500 జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 10వ తేదీన ఏలూరులో జరిగే ఆయాల సంఘం రాష్ట్ర మహాసభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాగేంద్ర, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా శ్మశాన వాటిక మార్పు

రుద్రవరం: మండల పరిధిలోని డీ.కొట్టాలలో శ్మశాన వాటిక మార్పు వివాదాస్పదంగా మారింది. ప్రస్తుతం గ్రామానికి దగ్గరలోనే అందరికి అనుకూలంగా 12 సెంట్లలో శ్మశాన వాటిక ఉంది. అయితే ఆ స్థలం సరిపోవడంలేదని గ్రామానికి చెందిన కొందరు మరో చోటికి మార్చాలని తహసీల్దారును కోరారు.ఇందుకు సంబంధించి మంగళవారం తహసీల్దారు మల్లికార్జునరావు గ్రామానికి వెళ్లి పాత శ్మశాన వాటికను పరిశీలించారు. అలాగే కొత్తగా ఏర్పాటు చేసేందుకు గ్రామా సమీపంలోని 266 సర్వేనంబరులో ఉన్న ప్రభుత్వ భూమి ని పరిశీలించారు. అక్కడ దాదాపు 5.50 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని అయితే గత కొన్నేళ్ల నుంచి ఆదే గ్రామానికి చెందిన కొందరు రైతులు ఆ భూమిలో పంటలు సాగు చేసుకుంటున్నారు. అందులో నుంచి ఓ ఎకరం భూమి కేటాయించాలని గ్రామస్తులు కొందరు తహసీల్దారును కోరారు.అయితే, అక్కడ తమ సొంత పొలాలు ఉన్నాయని తమ పొలాల గట్టు పక్కనే శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తే పంటలు ఎలా పండించుకోవాలని కొందరు అభ్యంతరం తెలిపారు. దీంతో కొత్త శ్మశాన వాటిక ఏర్పాటు సమస్యగా మారింది.

నైపుణ్య గణనపై శిక్షణ

ఉయ్యాలవాడ : నైపుణ్య శిక్షణ గణన సర్వేపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయ ఉద్యోగులకు, సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. నైపుణ్యం గణన సర్వే ప్రధాన ఉద్దేశం యువతలోని ప్రతిభను వెలికి తీయడం, అవసరమైన శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు కల్పించడమని ట్రైనర్ మౌలాలి తెలిపారు. ఇందుకు మండల పరిధిలోని ప్రతి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి యువతీ యువకులను గుర్తించడంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



చిన్నవంగలి గ్రామంలో మినుము పంటను పరిశీలిస్తున్న ఏఓ రంగనేతాజి

చాగలమర్రి: రైతులు పంటల సాగులో సస్య రక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి రంగనేతాజి అన్నారు. మంగళవారం మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా రైతులు సాగు చేసిన మినుము తదితర పంటలను పరిశీలించారు. ఆయా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కొన్ని రోజుల క్రితం కురిసిన వర్షాలకు మినుము పంట పొడవుగా పెరిగి పూత తక్కువగా రావడం జరిగిందని, దీనికి ప్లానోఫిక్స్ మందును పిచికారీ చేస్తే పూత అదనంగా వస్తుందన్నారు. అదేవిధంగా శనగ పంటలో ట్రైకోడెర్మవిరిడితో విత్తన శుద్ధి చేసుకోవడం ద్వారా వేరుకుళ్లు, మొదలు కుళ్లు తెగుళ్లను నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

బ్లాక్‌రైస్‌తో చక్కెర వ్యాధిని అదుపులో ఉంచవచ్చు

నంద్యాల(అర్బన్): బ్లాక్ రైస్‌లో ప్రొటీన్ కంటెంట్ ఎక్కువగా ఉంటుందని, వాటిని ఆహారంగా తీసుకోవడం ద్వారా చక్కెర వ్యాధిని నియంత్రణలో ఉంచుకోవచ్చని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం నంద్యాల మండలం అయ్యలూరు గ్రామంలో రైతులు సాగు చేసిన బ్లాక్ రైస్ వరిపంటను వ్యవసాయాధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ బ్లాక్ రైస్‌ను ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారా విక్రయించుకునే వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఏఓ ప్రసాదరావు, ఏఈఓ ముక్తార్‌బాషా, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు మెరుగైన సేవలు



టీడీఓ లక్ష్మీదేవిని సన్మానిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

ఆళ్లగడ్డ: ప్రభుత్వ ఉద్యోగులుగా సేవల అందించి పదవీ విరమణ చేసిన పెన్షర్లకు మెరుగైన సేవలు అందించేందుకు ఉప ఖజానా కార్యాలయం అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటారని జిల్లా ఖజానా అధికారిని లక్ష్మీదేవి అన్నారు. స్థానిక ఉప ఖజానా కార్యాలయాన్ని ఆమె మంగళవారం అకస్మిక తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులను, కంప్యూటర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ పెన్షర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 10, 573 మంది పెన్షనర్లు ఉన్నారన్నారు. వారందరికీ నెలనెలా పెన్షన్ అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆళ్లగడ్డ ఉప ఖజానా కార్యాలయం నూతన భవనం నిర్మాణం కోసం ప్రభుత్వం రూ 1.08 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఉప ఖజానా అధికారి సుశీలమ్మ, రాముడు, వెంకట్రావు, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా అష్టాదళ పాదపద్మారాధన సేవ

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీ కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో అమ్మవారికి కార్తీక మాసం సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీకాళికాంబ మూల విరాట్‌కు ఉదయాన్నే సుప్రభాత సేవ, పంచామృత అభిషేకాలు, నిమ్మ, వేప రసాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించి వివిధ రకాల పూలతో పూలంగి సేవ నిర్వహించారు. అమ్మవారికి వడిబియ్యం కార్యక్రమం నిర్వహించి, 108 వెండి పుష్పాలతో అష్టాదళ పాదపద్మారాధన సేవ నిర్వహించి మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం అమ్మవారికి నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయం ఈఓ లక్ష్మీనారాయణ, తదితర భక్తులు పాల్గొన్నారు.



కాళికాంబాదేవి

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని టెక్కెలో వెలసిన నాగలింగేశ్వర ఆలయంలో కార్తీక మాసం మంగళవారం పురస్కరించుకొని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారికి పంచామృతాభిషేకం, గంధాభిషేకం, సింధూరాభిషేకం నిర్వహించి స్వామి వారి కి తమలపాకులు, వడ మాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం మహామంగళ హారతులు ఇచ్చి తీర్థప్రసాదాలు అందజేశారు.

అవధూతస్వామి ఆరాధన

ఉయ్యాలవాడ: స్థానిక కుందూనది ఒడ్డున వెలసిన శ్రీవేణుగోపాలస్వామి ఆశ్రమంలో శివైక్యం పొందిన అవధూత బొమ్మన వెంకటసుబ్బారెడ్డి స్వామి 21వ ఆరాధనోత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆశ్రమ నిర్వాహకుడు మహానంది రెడ్డి ఆధ్వర్యంలో అవధూతస్వామి చిత్రపటంతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ, భక్తులు పాల్గొన్నారు.



గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రథమనందిలో భక్తులకు అన్నదానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రథమనందీశ్వరస్వామి దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మంగళవారం జరిగిన కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి దంపతులు హాజరై భక్తులకు ఆహారపదార్థాలు వడ్డించారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. కమిషనర్ దంపతులకు ఆలయ అర్చకులు సత్కరించి ఆశీర్వచనం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రుద్రవరంలో రక్తదాన శిబిరం

రుద్రవరం: క్రికెటర్ విరాట్ కోహ్లీ జన్మదినం సందర్భంగా ఆయన అభిమానులు మంగళవారం రక్తదాన చేశారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యురాలు జ్యోతి గ్రామంలోని అమ్మవారి సెంటర్లో క్యాంప్ నిర్వహించారు.ఈ క్యాంప్‌లో 20 యువకులు రక్తదానం చేశారు. వైద్యురాలు యువకుల ను అభినందించి అత్యవసర సమయాల్లో రక్తం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రుద్రవరం: కూటమి ప్రభుత్వం వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 104 వాహన సంఘం నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బైరం ప్రశాంత్, సిబ్బంది రవిశేఖర్ తదితరులు మంగళవారం నర్సాపురం పీహెచ్‌సీ డాక్టర్ జయలక్ష్మి కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ మూడు నెలల నుంచి వేతనాలు అందక కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు.

అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమిద్దాం

నంద్యాల(న్యూటౌన్): అమరవీరుల ఆశయ సాధనకై ఉద్యమించాని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యదర్శి నరసింహులు, నంద్యాల కార్యదర్శి శంకర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో చౌడప్ప అధ్యక్షతన భూమి కోసం, భుక్తికోసం పోరాడి అమరులైన నాయకుల సంస్మరణ సభ నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఆనంద్ మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు ఫరూక్, రఫీ, పఠాన్, అల్లాబకాష్, రోషిరెడ్డి, రమణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల దినోత్సవాన్ని జయప్రదం చేయండి

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 21వ తేదీన ప్రపంచ మత్స్యకారుల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు బీఎస్ నవీన్‌కుమార్, మార్కెట్ ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం స్థానిక సూరజ్ గ్రాండ్ హోటల్‌లో బెస్త సంఘాల నాయకుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారులు వివిధ సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కార్యక్రమంలో వెంకటరమణయ్య, సుబ్బయ్య, వెంకటేష్, ప్రసాద్, బుజ్జి, రమణ, హరీష్, పెద్దస్వామి, వెంకటరాముడు, మల్లేశ్వరుడు పాల్గొన్నారు.

హెచ్చరిక

జిల్లా కేంద్రమైన నంద్యాల పట్టణంలో నంద్యాల పట్టణ పరిసర ప్రాంతంలో గల నంద్యాల మునిసిపల్ కార్యాలయం వెనుక గల కుందూనదికి ఆనుకొని మూలసాగరం పరిధిలో ఉన్న సర్వే నెంబర్లు

1)	Dry Land	Sy.No.416 Full	Ac.7-80 Cents
2)	-do-	Sy.No.415 Pyki	Ac.1-60 Cents
3)	-do-	Sy.No.413 Pyki	Ac.0-10 Cents
4)	-do-	Sy.No.414/2 Pyki	Ac.0-22 Cents
5)	-do-	Sy.No.412 Full	Ac.3-28 Cents
			Total: Ac.13-00

భూమి మా ఉమ్మడి ఆస్తి. ఈ స్థలము నందు నంద్యాలకు చెందిన కొందరు వ్యక్తులు భూ కబ్జా చేయాలని, దురుద్దేశ్యంతో నకిలీ డాక్యుమెంట్ తయారు చేసుకొని మా స్థలాలను ఆక్రమించుకోవడానికి పూనుకొనగా అప్పట్లో నల్లగట్ల సుబ్బమోహన్ మరియు ఇతరులతో కలిసి 2019వ సంవత్సరములో మా కక్షిదారులు మరియు ఇతరులపై నంద్యాలలోని గౌరవ మూడవ అదనపు జిల్లా కోర్టు నందు దావా నంబరు **IA.No: 733/2019లో O.S: 2019/14** భాగ పరిష్కార దావా దాఖలు చేసి ఉన్నారు. ప్రస్తుతం కేసు గౌరవ మూడవ అదనపు జిల్లా కోర్టు, నంద్యాల నందు నేటికి విచారణలో ఉన్నది. కావున సదరు పై సర్వే నెంబరులోని భూమిని కొనుగోలు చేయడం చట్ట రీత్యా నేరము.

షేక్ షాజహాన్, న్యాయవాది, (R6 & R7), Cell: 9391697994.